# తల తిరుగుడు

వార్తా పత్రికలు చదివే కొందరు పతాక శీర్షికలు మాత్రమే చదివేసి పక్కన పారేస్తారు. పురుమలలో పుణ్య పురుషులున్నారే వారు మాత్రం 'ప్రింటెడ్ అండ్ పబ్లిషడ్ బై వరకూ చదివితే కాని పేపరు విడిచి పెట్టరు.

నేను ఆంజనేయస్వామి కోవెల వీధిలో దిగిన కొత్తలో ఒక మధ్యవయస్కుడు తన అరుగుమీద వాలుకుర్చీలో వాలి ఈ చివర్నించి ఆ చివరిదాకా అన్ని పేజీలు చదువుతూ ఉండేవాడు. మంచిదే, ఎంత లోకజ్ఞానం! అటువంటి వారు ఎవరితో ఏ విషయం చర్చించినా ఆ చర్చ సజీవంగా ఉంటుంది. అవతలి వాళ్ళని చిత్తుచేయగలరు కూడా! అలా ఆ మధ్య వయస్కునిలా చదివే అవకాశం నాబోటి ఇరవైనాలుగ్గంటల ఎన్జీవోకి లేనందుకు నేనెంతగానో అసూయ పడుతూంటాను.

అయితే ఆ మధ్య వయస్కునికి అంత ఓపిగ్గా పేపరంతా చదివే అవకాశం ఎక్కడిదా అని దర్యాప్తు చేశాను. అతనొక సన్నకారు రైతనీ, తన కుర్రకారు పొలం పనంతా చూసుకుంటారని అందుకే ఈయనకి పేపరు చదవడానికి ఇంత తీరబాటు దొరికిందని తెలిసింది. ఆహా అనుకున్నాను.

ఒకనాటి దినపత్రిక ఆదివారం అనుబంధంలోని శీర్షికలు ఆసక్తిదాయకంగా ఉంటే కనీసం ఈ ఆదివారమైనా పేపరు కొని చదువుదామని ఆ మధ్య వయస్కుని గుమ్మంలో అడుగు పెట్టి ఆయన వాలుకుర్చీవెనకనుంచీ పేపరు చదువుదామని ప్రయత్నించాను. చూద్దును కదా, నాతల తిరిగినట్టయింది.

ఒక నాటు తలనొప్పి వైద్యుడు "ఇక్కడ ప్రశస్తమైన తలనొప్పి మందు అమ్మబడును" అనే అట్ట బోర్డును పొరపాటున తిరగేసి తగిలించాట్ట! దాంతో అది చదవడానికి అందరూ తమ తలకాయల్ని తిరగేసి చదవవలసి వచ్చిందట! అప్పట్నుంచీ వాళ్ళకి తల తిరుగుడు ఎక్కువైందిట! అలా అయింది నాపని. ఆ మధ్య వయస్కుడు పేపరు తిరగేసి చదువుతున్నాడు.

అతను నిరక్షరకుక్షి అనీ, గొప్పకోసం పేపరు చదువుతున్నట్టు నటిస్తున్నాడనీ నాకు అప్పుడు అర్థమైంది.

⊗⊗⊗

1-7-1987

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక